సాక్షి
వికారాబాద్
సోమవారం ၊ 29 ၊ సెప్టెంబర్ ၊ 2025



వరుస వానలు..

ఏకధాటి వర్షాలకు జిల్లా వాసులు బెంబేలెత్తారు. వాగులు, వంకలు పొంగిపొర్లి పంటలు, రోడ్లు పాడయ్యాయి. 8లో ▸



మాదకద్రవ్యాలు వాడొద్దు

జినుగుర్తి గ్రామంలో రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. 8లో ▸



'ఇందిరమ్మ'కు ఇసుక కొరత

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక దొరకక మండల పరిధిలోని కొన్ని గ్రామాల్లో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. 9లో ▸

జెడ్పీ పీఠం.. బీసీకే పట్టం

గెజిట్ జారీ చేసిన ప్రభుత్వం



జిల్లా పరిషత్ కార్యాలయం

- పరిషత్ రిజర్వేషన్లు ఖరారు
- 20 జెడ్పీటీసీ స్థానాల్లో ఎనిమిది బీసీలకు
- నాలుగు ఎస్సీ.. రెండు ఎస్టీలకు
- జనరల్ కేటగిరీలో ఆరు స్థానాలు

వికారాబాద్: ఎట్టకేలకు స్థానిక సంస్థల రిజర్వేషన్లు వచ్చేశాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కేటాయింపు నేపథ్యంలో ఏడాది నుంచి ఊరిస్తూ వచ్చిన ప్రభుత్వం ఇందుకు సంబంధించిన లిస్టు విడుదల చేసింది. దీంతో ఉత్కంఠ వీడింది. త్వరలో షెడ్యూల్ విడుదల చేసేందుకు ఎన్నికల కమిషన్ కసరత్తు చేస్తున్న నేపథ్యంలో ఆశావహులు ఎన్నికలకు సంసిద్ధమవుతున్నారు. రిజర్వేషన్లు అనుకూలంగా వచ్చిన వారు సంతోషంలో ఉండగా.. ప్రతికూలంగా రిజర్వేషన్లు వచ్చిన వారు నిరాశకు గురవుతున్నారు. తొలిసారి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించటంతో జనాభాలో అత్యధికులుగా ఉన్న బీసీలకు ఎక్కువ స్థానాలు దక్కాయి. జిల్లాలో అత్యధిక ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులు, వార్డు సభ్యుల స్థానాలు బీసీలకు కేటాయించారు. జిల్లా పరిషత్ చైర్మన్ పీఠం సైతం బీసీ జనరల్ కావడంతో పార్టీలు బలమైన బీసీ నేతల వేటలో పడ్డాయి. తాజాగా విడుదల చేసిన రిజర్వేషన్ల ప్రకారం 20 మండలాల్లో ఎనిమిది ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు బీసీలకు కేటాయించారు. 227 ఎంపీటీసీ స్థానాల్లో 94 ఎంపీటీసీ, 594 పంచాయతీల్లో 250 సర్పంచ్ స్థానాలకు బీసీలకు రిజర్వ్ అయ్యాయి.

మద్దతు కూడగట్టుకుంటున్న ఆశావహులు

జిల్లాలో గతంలో 367 పంచాయతీలుండగా అదనంగా మరో 227 జీపీలు పెరిగాయి. ప్రస్తుతం జిల్లాలో వ్యాప్తంగా 594 గ్రామ పంచాయతీలు ఏర్పాడ్డాయి. వంద శాతం ఎస్టీ జనాభా ఉన్న పంచాయతీలను గతంలో ఎస్టీలకే రిజర్వు చేశారు. దీంతో బీసీ రిజర్వేషన్లకు అన్యాయం జరిగిందనే వాదన సైతం తెరపైకి వచ్చింది. ఇప్పుడు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల ప్రకటనతో ఆశావహులు పోటీకి సిద్ధమవుతున్నారు. జిల్లాలో గతంలో 4,850 వార్డులుండగా ప్రస్తుతం జిల్లాలో 5,058 వార్డులకు పెరిగాయి. ఈ వార్డుల వారీగా పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. ఆశావహులు తమ గ్రూపులు, వర్గాలను కూడగట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. మద్దతుదారులను పోగేసుకోవటంతో పాటు తమ ప్రాతినిధ్యాన్ని బలపర్చాలని ముఖ్య కార్యకర్తల మద్దతు కూడగట్టుకుంటున్నారు.

ఇక వరుస ఎన్నికలు!

అన్ని సజావుగా జరిగితే వరుస ఎన్నికలు రావటం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు ముగియగా మరో ఎన్నికల పండగకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గ్రామ పంచాయతీల పదవీకాలం గతేడాది జనవరి 31తో ముగియగా ఫిబ్రవరి నుంచి ప్రత్యేక అధికారుల పాలన జీపీలు కొనసాగుతున్నాయి. తాజాగా ప్రభుత్వం పరిషత్ ఎన్నికలు, పంచాయతీ ఎన్నికలకు రిజర్వేషన్లు ప్రకటించడంతో పాటు నోటిఫికేషన్‌కు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో వరుస ఎన్నికలు రావటం ఖాయమనే తెలుస్తోంది. ఇప్పటికే కలెక్టర్లు, డీపీఓలు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పోలింగ్ ఎప్పుడు అనే విషయంలో త్వరలోనే స్పష్టత రానుంది.

జెడ్పీటీసీ స్థానాల రిజర్వేషన్ల వివరాలు

జెడ్పీటీసీ స్థానం	రిజర్వేషన్
దుద్యాల, దోమ, మర్పల్లి, కుల్కచర్ల	బీసీ మహిళ
దౌల్తాబాద్, మోమిన్‌పేట, బొంరాస్‌పేట	జనరల్ మహిళ
పూడూరు, కోట్‌పల్లి	ఎస్సీ మహిళ
చౌడాపూర్	ఎస్టీ మహిళ
యాలాల, ధారూరు, బంట్వారం, బషీరాబాద్	బీసీ జనరల్
తాండూరు, కొడంగల్, నవాబుపేట	జనరల్
వికారాబాద్, పరిగి	ఎస్సీ జనరల్
పెద్దేముల్	ఎస్టీ జనరల్

కంప్యూటర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తుల్జారాంగౌడ్



రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నూతన కమిటీ సభ్యులు

పూడూరు: రాష్ట్ర పంచాయతీరాజ్ కంప్యూటర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎస్.తుల్జారాంగౌడ్, ఉపాధ్యక్షుడిగా ఎం.వెంకట్, ప్రధాన కార్యదర్శిగా నాంచేరి రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొనగాల మహేశ్ ప్రకటించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ.. కంప్యూటర్ ఆపరేటర్స్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సంఘం నూతన కమిటీ సభ్యులు మహేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

చేపల వలకు చిక్కిన కొండ చిలువ

లగచర్ల అడవుల్లో వదలిన అటవీశాఖ అధికారులు



వలకు చిక్కిన కొండచిలువ

దుద్యాల్: మండలం పరిధిలోని పోలేపల్లి గ్రామంలో కొండచిలువ కలకలం సృష్టించింది. ఆదివారం మత్స్యకారులు చేపల వేటకు వెళ్లగా.. వారి వలకు భారీ కొండ చిలువ చిక్కింది. మత్స్యకారులు వల లాగేందుకు యత్నించగా ఎంతకూ రాకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ యాదగిరి ఘటనా స్థలికి చేరుకుని విషయాన్ని అటవీశాఖ అధికారులకు చేరవేశారు. వలలో చిక్కిన కొండ చిలువను ట్రాక్టర్లో తీసుకెళ్లి లగచర్ల అటవీ ప్రాంతంలో వదిలినట్లు అటవీశాఖ బీట్ అధికారి రవి తెలిపారు. ఇటీవలే కురిసిన వర్షాలకు వచ్చిన వరదల్లో చెరువులోకి వచ్చినట్లు అనుమానిస్తున్నారు.

స్థానిక ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరేస్తాం

మాజీ మంత్రి సబితారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: స్థానిక ఎన్నికలు నిర్వహించాలన్న చిత్తశుద్ధి కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో కనిపించడం లేదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా రెడ్డి అన్నారు. ఒకవేళ నిర్వహిస్తే జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలన్నీ బీఆర్ఎస్ కైవసం చేసుకోవడం ఖాయమని చెప్పారు. ఈ మేరకు ఆదివారం శంషాబాద్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పేరుతో 22 నెలలుగా నాటకాలాడుతున్న రేవంత్ ప్రభుత్వం మొదట్లోనే ఎందుకు జీఓ జారీ చేయలేదని ప్రశ్నించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరిట అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చాక అమలు చేయడం లేదని అన్నారు. రిజర్వేషన్లు 50 శాతానికి మించితే రాజ్యాంగబద్ధంగా చర్యలు చేపట్టాల్సింది పోయి జీఓ జారీ చేయడం కాలయాపన కోసమేనని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లకు అసెంబ్లీ తీర్మానం, గవర్నర్ ఆమోదం, కేంద్ర ఆమోదం కోసం ఢిల్లీలో ధర్నా తదితర డ్రామాలతో కాలయాపన చేసిన రేవంత్ చివరికి మోసపూరిత జీవో జారీచేసి ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. వాస్తవా లను గమనించలేనంత అమాయకులు ప్రజలు కారని, మోసకారి కాంగ్రెస్‌కు కర్రకాల్చి వాత పెట్టే రోజు దగ్గరలోనే ఉందన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్ఎస్ జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఏ రిజర్వేషన్లు వచ్చినా పోటీకి సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, సీనియర్ నాయకుడు క్యామ మల్లేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు చిలకమర్రి నర్సింహ, జెడ్పీటీసీ మాజీ సభ్యులు పట్నం అవినాష్ రెడ్డి, బూర్కుంట సతీష్, రమేశ్ గౌడ్, కార్మిక నాయకుడు పి.నారాయణ పాల్గొన్నారు.



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

రూ.81 లక్షలతో సీసీ రోడ్లు

ప్రారంభించిన ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

దోమ: అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని బొంపల్లి, బాస్‌పల్లి, గోడుగోనిపల్లి, దోర్నాల్‌పల్లి, మైలారం, మోత్కూర్ గ్రామాలలో రూ.81లక్షలతో వేసిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం పంచాయతీలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దే పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతీ గ్రామంలో సీసీ రోడ్లు, యూజీడీ, హైమాస్ట్ లైట్లు, పంచాయతీ భవనాలు తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ శాంతుకుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, బద్రి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ యాదయ్యగౌడ్, మాజీ సర్పంచ్‌లు సురేశ్, అనంతయ్య, రాములు, యాదయ్యసాగర్, పార్టీ సీనియర్ నేతలు రాఘవేందర్‌రెడ్డి, అంతిరెడ్డి, శ్రీనివాస్, నర్సింహారెడ్డి, మల్లారెడ్డి, బాల్‌రాజ్, యాదగిరి, శేఖర్, రాములు, బషీర్, ఇంతియాజ్, హైమద్, భీమయ్య, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మోత్కూర్ గ్రామంలో రూ.1.50 లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను కార్యకర్తలతో కలసి ప్రారంభించారు. బొంపల్లి గ్రామంలో సింగిల్ ఫేస్ మోటర్‌ను ప్రారంభించి గ్రామస్తులకు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకున్నారు.

ఓటు చోరీతోనే అధికారంలోకి బీజేపీ

పరిగి: ఓటు చోరీతోనే కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందని పరిగి ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన పట్టణ కేంద్రంలో ఓటు చోరీపై సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆత్మ కమిటీ నూతన భవనాన్ని ప్రారంభించారు. సుల్తాన్‌పూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ బీజేపీ ప్రభుత్వంపై ఓటు చోర్ గద్దే చోడ్ అనే నినాదానికి రాష్ట్రం మద్దతు తెలుపుతోందన్నారు. దొంగ ఓట్లపై రాహుల్‌గాంధీ పోరాడుతుంటే ఎన్నికల కమిషన్‌చే కేసులు పెట్టించడం సరికాదన్నారు. బీజేపీ ఓట్ చోరీతో అధికారంలోకి వచ్చిందనే విషయాన్ని ప్రతి గడప గడపకు చేరవేసే బాధ్యత ప్రతి కార్యకర్త తీసుకోవాలన్నారు త్వరలోనే రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ నియోజకర్గ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఏడీఏ లక్ష్మీకుమారి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అవన్నీ తప్పుడు 'మార్గాలు'

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కద్దాల్: సీఎం రేవంత్‌రెడ్డి తన కుటుంబం, బంధువుల ఆస్తుల విలువ పెంచుకోవడానికే గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటు చేయడంతో పాటు ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చడం జరిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కద్దాల్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల మీదుగా ఏర్పాటు చేస్తున్న 765 హైటెన్షన్ విద్యుత్‌లైన్ అలైన్‌మెంట్‌కు వ్యతిరేకంగా బాధిత రైతులు చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం 21వ రోజుకు చేరుకున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాగర్జన సభకు వెళ్తున్న కేటీఆర్ దీక్ష శిబిరం వద్దకు చేరుకుని వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగా సొంత భూముల విలువ పెంచుకోవడానికి ఎవరికీ అవసరం లేని గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటు చేస్తున్నారని విమర్శించారు. రోడ్డు నిర్మాణం కోసం 1,200 ఎకరాల పట్టా భూములను రైతుల నుంచి సేకరిస్తుండంతో వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. సొంత ఆస్తుల విలువను పెంచుకోవడంతో పాటు అనుయాయులకు దోచిపెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటామని, రైతులకు అండగా ఉంటామన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో పేదల కడుపుకొట్టకుండా, వారికి నష్టం కలుగకుండా అభివృద్ధి పనులు చేపట్టామని గుర్తు చేశారు. హైటెన్షన్ విద్యుత్‌లైన్ బాధిత రైతులు కలిసి వస్తే న్యాయస్థానంలో వారి పక్షాన పోరాడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

పండుగ పూట పరేషాన్

- కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాలు పెండింగ్
- నాలుగు నుంచి ఎనిమిది నెలలుగా ఇబ్బంది పడుతున్న హెల్త్, ఎడ్యుకేషన్, డీఆర్డీఏ ఉద్యోగులు
- ప్రభుత్వ ఉద్యోగులకు అందని బిల్లులు
- అప్పు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్న వైనం

వికారాబాద్: ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు వేతనాలు పెండింగ్ పెడుతున్నారు. దీంతో పండుగపూట సైతం పస్తులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కోసారి నాలుగు నుంచి ఎనిమిది నెలల వరకు వేతనాలు విడుదల చేయడం లేదని వాపోతున్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఎప్పుడో ఒకప్పుడు ఉండే ఈ సమస్య కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత మరింత జఠిలమైందని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు పదిరోజులు ఆలస్యంగా ఖాతాల్లో జమ చేసినా ప్రభుత్వంపై మండిపడే ఉద్యోగ సంఘాలు వీరి విషయంలో మాత్రం నోరుమెదపడం లేదు. ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగులు, అధికారులు, పోలీసుల టీఏ, డీఏ బిల్లులు సైతం ఆరు నెలలుగా అందడం లేదని పేర్కొంటున్నారు. ఆయా కార్యాలయాల నిర్వహణ బిల్లులు పాస్ కావటం లేదు. అప్పులు చేసి కార్యాలయ విధులు నిర్వహించాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళన చేపట్టినా అందని వేతనం

జిల్లాలో వైద్యారోగ్య శాఖలో కాంట్రాక్టు ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న సుమారు 800 మంది, విద్యాశాఖలో 750 మంది, డీఆర్డీఏలో 200 మంది ఉద్యోగులకు నెలనెలా వేతనాలు అందడంలేదు. గతంలో రెండు, మూడు నెలలు ఆలస్యమవగా ప్రస్తుతం ఒక్కో శాఖలో నాలుగు నెలల నుంచి ఎనిమిది నెలలుగా వేతనాల కోసం పడిగాపులుకాస్తున్నారు. మండల విద్యా వనరుల కేంద్రాల్లో, కస్తూర్బా గాంధీ గురుకులాల్లో విధులు నిర్వహించే నాన్ టీచింగ్ స్టాఫ్, సీఆర్పీలు, ఎంఐసీలు, పీటీఐలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఐఈఆర్పీలు వేతనాలు అందని వారిలో ఉన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో విధులు నిర్వహించే గెస్ట్ లెక్చరర్లు ఎనిమిది నెలలుగా వేతనాలు అందటంలేదంటూ ఇటీవల ఆందోళన చేపట్టినా ఎటువంటి ఫలితం దక్కలేదు. డీఆర్డీఏ శాఖలో అటెండర్లు, సీసీలు, ఏపీఓలు, టీఏలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఏపీఎంలు తదితరులు వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నారు.

చక్కదిద్దకుంటే రోడ్డెక్కుతాం

రాష్ట్రంలో దసరా ఘనంగా నిర్వహించుకుంటారు. ఇంటిల్లిపాది కొత్త దుస్తులు కొనుగోలు చేస్తుంటారు. ఇప్పటికీ వేతనాలు అందక.. బిల్లులు రాక పండుగకు పస్తులు తప్పేట్లు లేదంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. పది నుంచి 20 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ఓ పక్క క్రమబద్ధీకరించాలని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతుండగా ప్రభుత్వం వేతనాల విడుదలలోనూ అలసత్వం వహిస్తోంది. అప్పు పుట్టడం లేదని ఆవేదన చెందుతున్నారు. వేతనాల విడుదలలో వివక్ష తగదంటున్నారు. పరిస్థితి చక్కదిద్దకుంటే రోడ్డెక్కక తప్పదని హెచ్చరిస్తున్నారు.



కాంగ్రెస్‌ది కపట నాటకం

- బీసీ రిజర్వేషన్ అడ్డుకునేందుకు సీఎం అనుచరుడితో కోర్టులో పిటిషన్
- రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్



మాట్లాడుతున్న శుభప్రద్‌పటేల్

తాండూరు: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని బీసీ సామాజిక వర్గాన్ని 42 శాతం రిజర్వేషన్‌ల పేరిట దగా చేస్తోందని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్ అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలోని ఎస్‌ఎస్‌పీ ట్రస్ట్ భవనంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శుభప్రద్ పటేల్ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ సభ నిర్వహించి 42 శాతం బీసీలకు రిజర్వేషన్‌లు అమలు చేస్తామని ప్రకటించిందని గుర్తు చేశారు. ఈ నెల 26వ తేదీన 42 శాతం రిజర్వేషన్‌పై ప్రభుత్వం జీఓ జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల కోసం రిజర్వేషన్‌లు ప్రకటించారన్నారు. రిజర్వేషన్‌లు ప్రకటించిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి అనుచరుడు మాధవరెడ్డి రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ కోర్టును ఆశ్రయించారన్నారు. రిజర్వేషన్‌లను అడ్డుకునేందుకు కాంగ్రెస్ కపట నాటకమాడుతోందని ఆరోపించారు. బీసీ బిల్లు గవర్నర్ వద్ద నేటికీ పెండింగ్‌లో ఉందన్నారు. బీసీ బిల్లు ఆమోదం పొందకుండానే ప్రభుత్వం రిజర్వేషన్‌ల జీఓలను తీసుకొచ్చి మోసం చేస్తోందన్నారు. బీసీ బిల్లు ఆమోదం కోసం ఢిల్లీలో సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు ధర్నా చేస్తే ఏఐసీసీ నేతలు ఎందుకు మద్దతు తెలపలేదని ప్రశ్నించారు. బీసీలను కాంగ్రెస్, బీజేపీలు మోసం చేస్తున్నాయన్నారు. ప్రాంతీయ పార్టీలతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రభుత్వ మోసాన్ని ప్రజలకు తెలిసేలా 22 నెలల పాలనలో కాంగ్రెస్ బాకీ కార్డు పేరిట బీఆర్ఎస్ పార్టీ క్షేత్ర స్థాయిలో ప్రజా ఉద్యమం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భానుప్రసాద్, నరేష్‌గౌడ్, సిద్దిక్, శ్రీధర్, మనోహర్ తదితరులున్నారు.

అయ్యో.. గోమాత!



గోశాల షెడ్డులో హృదయవిదారకంగా పశువుల కళేబరాలు

కాగ్నా వరదకు 91 మూగజీవాలు మృత్యువాత

బషీరాబాద్: గోశాలలో గోవులను కట్టేసిన తగుళ్లే(తాడు) యమపాశాలయ్యాయి. వరద ఉధృతి నుంచి తప్పించుకోలేక 91 మూగజీవాలు మృత్యువాతపడ్డాయి. ఈ హృదయ విదారక ఘటన జీవన్గీ-జెట్టూరు శివారులో కాగ్నా నది ఒడ్డునున్న గోశాలలో చోటు చేసుకుంది. వరద ఉధృతి తగ్గడంతో ఆదివారం గోశాల నిర్వాహకులు అక్కడి పరిస్థితి చూసి భీతిల్లారు. మహబూబ్‌నగర్ మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఈ గోశాల బాధ్యతను గంగ్వార్‌కు చెందిన బంధువు ప్రతాప్ రెడ్డి చూసుకుంటున్నారు. రెండు రోజులుగా వర్షాలు కురవడంతో శనివారం కాగ్నా నది వరద పోటెత్తి గోశాలపై నుంచి సుమారు ఏడు ఫీట్లకు పైగా ప్రవహించింది. వరదల్లో చిక్కుకున్న 136 పశువుల్లో 45 గోవులను ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది కాపాడగా 46 కళేబరాలు లభ్యమయ్యాయి. మరో 45 జీవాలు వరదకు కొట్టుకుపోయాయని నిర్వాహకులు తెలిపారు. గోవుల కళేబరాలను ఖననం చేశారు.



సూర్యప్రభ వాహనంపై అనంత పద్మనాభుడు



కల్యాణోత్సవంలో తలంబ్రాల క్రతువులో పాల్గొన్న భక్తులు



శేష వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

వైభవం.. వేంకటేశ్వర కల్యాణం

అశ్వవాహనంపై ఊరేగిన శ్రీవారు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 11 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం కన్నులపండువగా జరిగింది. ఈ ఉత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాత్రి స్వామి వారిని అశ్వవాహనంపై ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలన్నీ గోవింద నామస్మరణతో మార్మోగాయి. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై అనంతుడు

వికారాబాద్‌లోని ఆలంపల్లిలో వెలిసిన లక్ష్మీఅనంతపద్మనాభ స్వామి వారు ఆదివారం రాత్రి సూర్యప్రభ వాహనంపై ఊరేగారు. ఆలయ మాడ వీధుల్లో భక్తుల హరినామస్మరణ నడుమ ముందుకు సాగింది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఊరూరా బతుకమ్మ



పరిగి: పట్టణ కేంద్రంలో బతుకమ్మ సంబరాల్లో యువతులు

కుల్కచర్ల: కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో మహిళలు బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి ఆట, పాటలతో హుషారుగా ఆడారు.

పరిగిలో..

పరిగి: పట్టణ కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఆదివారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పట్టణ కేంద్రంలోని పలు వార్డుల్లో మహిళలు బతుకమ్మ పాటలు పాడి సంబరాలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక అని పలువురు పేర్కొన్నారు.

హిందూత్వభావనను అలవర్చుకోవాలి

ప్రముఖ ఆధ్యాత్మికవేత్త భాస్కరయోగి



ప్రసంగిస్తున్న ఆధ్యాత్మికవేత్త భాస్కరయోగి

కుల్కచర్ల: ప్రతిఒక్కరూ హిందూత్వభావనను అలవర్చుకోవాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త భాస్కరయోగి పేర్కొన్నారు. ఆదివారం బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో ఏర్పాటుచేసిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రస్తుతం యువత వివిధ దీక్షలు స్వీకరిస్తూ హిందూ ధర్మాన్ని ఆచరించేందుకు ముందుకువస్తున్నారన్నారు. ఇది హర్షించదగ్గ అంశమని పేర్కొన్నారు. యువతకు తమతమ వ్యక్తిగత ప్రవర్తనను మార్చుకోవడానికి సైతం దీక్షధారణ ఉపయుక్తంగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాంబండ ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి, పీఎస్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్, నాయకులు బాల్‌రెడ్డి, హరికృష్ణ, వార్ల సాయి, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు పిల్లలతో సహా తల్లి అదృశ్యం



అంజమ్మ (ఫైల్)

దుద్యాల్: తల్లితో పాటు ముగ్గురు పిల్లలు అదృశ్యం అయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ యాదగిరి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన శివగారి అంజమ్మ, భర్త శేఖర్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కృష్ణ కుమార్, సాయితేజ, తేజ శ్రీ ముగ్గురు సంతానం. ఈ క్రమంలో కూతురు తేజ శ్రీ అనారోగ్యంతో ఇబ్బంది పడుతుండడంతో అంజమ్మ ఈ నెల 24న ముగ్గురు పిల్లలతో కలిసి కొడంగల్ ఆస్పత్రికి వెళ్లింది. వారు సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లిందని భర్త భావించాడు. మరుసటి రోజు శేఖర్ అంజమ్మ తల్లిదండ్రులకు, బంధువులకు వద్ద వాకబు చేసినా ఆమె ఆచూకీ లభ్యమవ్వలేదు. దీంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

విద్యార్థి బలవన్మరణం

హయత్‌నగర్: ఫ్యాన్‌కు ఉరేసుకుని ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, కొహెడ గ్రామానికి చెందిన నవీన్‌కుమార్(19) మంగళ్‌పల్లిలోని శ్రీ ఇందూ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై సమాచారం అందడంతో సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

❖ స్పీకర్ దృష్టికి తీసుకెళ్తాం

మర్పల్లి: వరుస వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతుల సమస్యలను స్పీకర్ ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేశ్, పార్టీ నాయకులు సుభాష్ యాదవ్ రైతుకు భరోసా ఇచ్చారు. ఆదివారం వారు మండల పరిధిలోని కల్‌ఖోడ, పెద్దాపూర్, రావులపల్లి, తిమ్మాపూర్ గ్రామాల్లో పాడైన పంటలను, రోడ్లను పరిశీలించారు. చంద్ర సాగర్ చెరువు, రావులపల్లి, తిమ్మాపూర్ చెరువుల కింద ఆయకట్టు రైతులు సాగు చేసిన పత్తి, పసుపు, కంది, మొక్కజొన్న, జొన్న, కూరగాయలు, పూలతోటలు సుమారు 300 ఎకరాల్లో నష్టపోయినట్లు ప్రాథమిక అంచనా వేశారు. కల్‌ఖోడలో ఇళ్లలోకి వరద చేరి సర్వస్వం కోల్పోయిన సుమారు 40 కుటుంబాలకు ఒక్కొక్కరి 25 కేజీల బియ్యం అందజేశారు. కూలిన ఇళ్లను పరిశీలించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మర్పల్లి ఏఎంసీ వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, సహకార సంఘం వైస్ చైర్మన్ ఫసి, పట్లూర్ ఎంపీటీసీ మాజీ సభ్యులు సురేష్, మహేష్, రావులపల్లి మాజీ సర్పంచ్ అబ్రహం, సీనియర్ నాయకులు రఫి, సురేశ్, దివాకర్, నర్సింలు యాదవ్, శేఖర్ యాదవ్, రవికుమార్ నాయక్, పాండునాయక్ రైతులు ఉన్నారు.



బాధితులకు బియ్యం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వరుస వానలు.. జనం బెంబేలు

ఏకదాటి వర్షాలకు జిల్లా వాసులు బెంబేలెత్తారు. వాగులు, వంకలు పొంగిపొర్లి పంటలు, రోడ్లు పాడయ్యాయి. పలు చోట్ల ఇళ్లలోకి నీరు జనం ఇబ్బందులు పడ్డారు. ఆదివారం పలువురు నేతలు ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రజలను పరామర్శించారు.

– సాక్షి, నెట్‌వర్క్

కూలుతున్న గూడు

ధారూరు: వరుస వర్షాల కారణంగా బండల ఇళ్లు కూలుతున్నాయి. మండల పరిధిలోని డీకే తండాలో వర్‌త్య సురేశ్ కుటుంబ సభ్యులతో కలిసి నిద్రకు ఉపక్రమించారు. శనివారం అర్ధరాత్రి ఒక్కసారిగా శబ్దం రావడంతో సురేశ్ అప్రమత్తమై అందరిని బయటకు తీసుకువచ్చాడు. నిమిషాల వ్యవధిలో ఇల్లు కూలింది. ప్రభుత్వం వెంటనే ఆర్థికసాయం అందించాలనీ సురేశ్ కోరాడు. ధారూరు, కేరెళ్లి, గట్టెపల్లి తదితర గ్రామాల్లోనూ ఇళ్లు కూలుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు.

పాడైన రోడ్లు

దోమ: ఏకాధాటి వర్షాలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ఓ వైపు పంటలు పాడవగా.. రోడ్లు ధ్వసమయ్యాయి. మండల పరిధిలోని మోత్కూర్, ఐనాపూర్ ప్రధాన బీటీ రోడ్డు ఐనాపూర్ చెరువు అలుగు పారడడంతో పూర్తిగా ధ్వంసమైంది. బొంపల్లి సమీపంలో పరిగి–మహబుబ్‌నగర్ ప్రధాన రోడ్డుపై వర్షాలకు నీరు నిలిచింది. ఆర్‌అండ్‌బీ అధికారులకు విషయం తెలిసినా కనీస చర్యలు తీసుకోవడం లేదని ఆయా గ్రామాల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



బొంపల్లి సమీపంలో రోడ్డుపై నిలిచిన వరద

కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన



దెబ్బతిన్న రుద్రారం–నాగసమందర్ వంతెనను పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

ధారూరు: ఎడతెరిపి లేని వర్షాలకు కోట్‌పల్లి పోటెత్తింది. రుద్రారం–నాగసమందర్ మధ్య అలుగు నీరు ఆరు ఎడుగుల ఎత్తుతో ప్రవహించడంతో మూడేళ్ల క్రితం నిర్మించిన తాత్కాలిక వంతెన కొట్టుకుపోయింది.

దెబ్బతిన్న రోడ్డును పరిశీలించిన సీఐ

ఆదివారం ధారూరు సర్కిల్ సీఐ రఘురామ్, ఎస్ఐ రాఘవేందర్ దెబ్బతిన్న రోడ్డును పరిశీలించారు. రాకపోకలు సాగనీయకుండా రోడ్డుకు అడ్డుగా కట్టవేయించారు. ప్రాజెక్టుకు పర్యాటకులు అనుమతించడం లేదు.

రైలు పట్టాలపై నిరసన

తాండూరు రూరల్: సంగెంకలాన్ సమీపంలోని చెట్టినాడు ఫ్యాక్టరీకి వెళ్తున్న గూడ్స్ రైలును గ్రామస్తులు అడ్డుకున్నారు. పట్టాలపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. తెలంగాణ–కర్ణాటక సరిహద్దు సంగెంకలాన్ సమీపంలోని చెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీ రైల్వేట్రాక్ వల్లే ఎస్సీ కాలనీ నీట మునుగుతుందని మల్కాపూర్–చెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీకి రైల్వేట్రాక్ నిర్మాణ సమయంలో బండల వాగు వద్ద రైల్వేట్రాక్ కోసం పెద్ద ఫీలర్లు నిర్మించారని.. ఇవి పాడవడంతో డీపో వాగు నుంచి బండల వాగు మీదగా కర్ణాటకకు వెళ్లే వరద గ్రామంలోని ఎస్సీ కాలనీలోకి వస్తోందన్నారు. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు ఇళ్లలోని నిత్యావసరాలను సైతం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు పాడవుతున్నందన బ్రిడ్జి నిర్మాణాన్ని విస్తరించాలని డిమాండ్ చేశారు.



తాండూరు రూరల్: గూడ్స్‌రైలును ఆపి పట్టాలపై కూర్చొని ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

జీఎంతో మాట్లాడిస్తాం

గ్రామస్తులు గూడ్స్ రైలును అడ్డుకోవడంతో విషయం తెలుసుకున్న చెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీ హెచ్ఆర్ ప్రతినిధులు భీంరెడ్డి ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఆందోళనకారులతో మాట్లాడి కంపెనీ నుంచి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం జీఎం అందుబాటులో లేడని ఆయన వచ్చిన తర్వాత గ్రామస్తులు కంపెనీకి వచ్చి మాట్లాడాలని సూచించారు. దీంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

భారీ వర్షాలతో రైతన్నకు ఇబ్బందులు



హస్నాబాద్ సమీపంలో నీట మునిగిన వరి పంట

నీట మునిగిన పంటలు

దుద్యాల్: మండల వ్యాప్తంగా కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతన్న ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. పలు గ్రామాల్లో పంటలు నీట మునగడంతో ఆందోళన చెందుతున్నారు. పెట్టిన పెట్టుబడులు నీటి పాలు కావడంతో లబోదిబోమంటున్నారు. మండల పరిధిలోని ఆలేడ్, హస్నాబాద్, కుదురుమల్ల గ్రామాల్లో పత్తి, వరి పూర్తిగా మునిగిపోయాయి.

200 ఎకరాల్లో..

తాండూరు రూరల్: మండలంలోని వీర్‌శెట్టిపల్లి గ్రామంలో 200 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని నారాయణపూర్ ఏఈఓ శ్రీకాంత్ పేర్కొన్నారు. భారీ వర్షాల కారణంగా జలదిగ్బంధమైన వీర్‌శెట్టిపల్లి గ్రామంలో ఆయన పర్యటించారు. వాగు సమీపంలో దెబ్బతిన్న పత్తి, కంది, వరి పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. దాదాపు 200 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని ప్రభుత్వానికి నివేదిక పంపిస్తానని ఏఈఓ వివరించారు.



తాండూరు రూరల్: వీర్‌శెట్టిపల్లి గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న ఏఈఓ శ్రీనివాస్

‘పరిషత్’ పీఠాలు బీసీలకు!



మోమిన్‌పేట మండలపరిషత్ కార్యాలయం

- బషీరాబాద్ ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు వారికే
- ఎంపీటీసీ సీట్లలో ఐదు వెనకబడిన తరగతులకే

బషీరాబాద్/దుద్యాల్: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ తీసుకు వచ్చిన జీఓతో తమకు రాజకీయంగా మేలు జరుగుతుందని వెనకబడిన తరగతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ జీఓ ఎలాంటి అడ్డంకులు లేకుండా అమలైతే అత్యధిక స్థానాల్లో బీసీలు ప్రజాప్రతినిధులుగా రానున్నారు. జిల్లా హైపర్ కమిటీ విడుదల చేసిన పరిషత్, పంచాయతీల రిజర్వేషన్‌ల జాబితాలో బీసీలకు అధిక స్థానాలు దక్కాయి. బషీరాబాద్ మండలంలో జెడ్పీటీసీ, ఎంపీపీ రెండు ముఖ్యమైన పదవులు బీసీ జనరల్‌గా రిజర్వ్ అయ్యాయి.ప్రధాన బీసీ నాయకులు ఈ దవులకు పోటీ చేయడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

పదవుల కోసం మహరాజుల పట్టు..

బషీరాబాద్‌కు చెందిన మాజీ మంత్రులు మాణిక్‌రావు, చంద్రశేఖర్ కుటుంబానికి చెందిన మల్కూడ్ మహరాజులు అధికార పార్టీ తరుపున జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలపై కన్నేశారు. ఈ రెండు స్థానాలకు కాంగ్రెస్ తరుపున పోటీ చేయడానికి వెంకటేశ్ మహరాజ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాకేశ్ మహరాజ్ ఆసక్తి చూపుతున్నారు. గతంలో స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు తమకు అవకాశం వస్తుందంటున్నారు. మరోవైపు మాజీ ఎంపీపీ కరుణ భర్త సొసైటీ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్ ఎంపీపీ లేదా, జెడ్పీటీసీ స్థానాల్లో ఒకటి కోరుతున్నారు. అయితే రెండు పదవులు బీసీలకే రిజర్వ్ కావడంతో మహరాజుల కుటంబానికి ఒకటి, అజయ్‌ప్రసాద్‌కు మరోకటి ఇవ్వాలని ఎమ్మెల్యే నిర్ణయించినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

మోమిన్‌పేట ఎంపీపీ జనరల్

మోమిన్‌పేట: మోమిన్‌పేట మండల జెడ్పీటీసీ జనరల్ మహిళాకు రిజర్వు చేశారు. ఎంపీపీ జనరల్‌కు రిజర్వు అయ్యింది. మండలాల వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి జనరల్‌కు ఈ సారి మాత్రమే దక్కింది. 1988లో ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించినప్పుడు జనరల్‌కు రిజర్వు చేశారు. ఆ తర్వాత జరిగిన పరోక్ష ఎన్నికల్లో 2013లో జనరల్ మహిళకే రిజర్వు అయ్యింది. ప్రస్తుతం ఎస్టీలకు 12శాతం, ఎస్సీలకు 15శాతం, బీసీలకు 42శాతం ప్రభుత్వం కేటాయించడంతో మండల పరిధిలోని 12 ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు ఇలా ఉన్నాయి. మోమిన్‌పేట–1 జనరల్ (మహిళ), మోమిన్‌పేట–2 బీసీ (మహిళ), మోమిన్‌పేట–3 బీసీ (జనరల్), కోల్కుంద జనరల్(మహిళ), మేకవనంపల్లి ఎస్టీ(మహిళ), ఎన్కేపల్లి బీసీ(జనరల్), మొరంగపల్లి ఎస్సీ (జనరల్), వెల్‌చాల్ జనరల్, రాంనాథ్‌గుడుపల్లి ఎస్సీ (మహిళ), ఏన్కతల బీసీ(జనరల్), టేకులపల్లి బీసీ(మహిళ), చీమల్‌దరి ఎస్సీ(జనరల్)లకు రిజర్వు చేయబడ్డాయి.

కొడంగల్ ఎంపీటీసీ స్థానాల వివరాలు

హస్నాబాద్, రుద్రారం–2, అప్పాయిపల్లి	బీసీ జనరల్
అన్నారం, రావుపల్లి	బీసీ మహిళ
పెద్ద నందిగామ, అంగడిరాయిచూర్	ఎస్సీ జనరల్
ఇందనూరు	ఎస్సీ మహిళ
పర్సాపూర్	ఎస్టీ జనరల్
చిట్లపల్లి	జనరల్ మహిళ
రుద్రారం–1	జనరల్

దుద్యాల్ ఎంపీటీసీ స్థానాల వివరాలు

గౌరారం, లగచర్ల	జనరల్
దుద్యాల–2, హకీంపేట	బీసీ జనరల్
కుదురుమల్ల	బీసీ మహిళ
పోలేపల్లి	ఎస్సీ జనరల్
చిలుముల్ మైల్వార్	ఎస్టీ జనరల్
దుద్యాల–1	జనరల్ మహిళ

బొంరాస్‌పేట ఎంపీటీసీ స్థానాల వివరాలు

మెట్లకుంట, బాపల్లితండా, ఎన్కేపల్లి, ఏర్పుమల్ల	బీసీ జనరల్
సాలిండాపూర్	బీసీ మహిళ
తుంకిమెట్ల, కొత్తూరు	ఎస్టీ జనరల్
బుర్హాన్‌పూర్, రేగడిమైల్వార్	ఎస్టీ మహిళ
చౌదరిపల్లి	ఎస్సీ జనరల్
బొంరాస్‌పేట	జనరల్

దౌల్తాబాద్ ఎంపీటీసీ స్థానాల వివరాలు

దౌల్తాబాద్–2, బాలంపేట, తిమ్మారెడ్డిపల్లి	బీసీ జనరల్
బిచ్చాల్, చెల్లాపూర్, అల్లాపూర్	బీసీ మహిళ
సుల్తాన్‌పూర్, దేవరపస్లబాద్	ఎస్సీ జనరల్
గోకఫస్లవాద్	ఎస్సీ మహిళ
చంద్రకల్	ఎస్టీ జనరల్
మాటూరు, నీటూరు	జనరల్ మహిళ
దౌల్తాబాద్–1, నందారం	జనరల్

బషీరాబాద్ ఎంపీటీసీ స్థానాల వివరాలు

దామర్‌చెడ్, జీవన్గీ, బషీరాబాద్–2	బీసీ జనరల్
క్యాద్గీరా, బషీరాబాద్–1	బీసీ మహిళ
కాశీంపూర్	ఎస్సీ జనరల్
మంతట్టి	ఎస్సీ మహిళ
ఎక్మాయి	ఎస్టీ జనరల్
కొర్విచెడ్	ఎస్టీ మహిళ
పర్వత్‌పల్లి	జనరల్ మహిళ
మైల్వార్, నవల్గా	జనరల్

గ్రూప్ సర్వీస్‌లో అభ్యర్థుల విజయకేతనం



క్రాంతికుమార్‌ను అభినందిస్తున్న స్థానికులు

ఎంపీడీఓగా ఉద్యోగం పొందిన బొంరాస్‌పేటవాసి

బొంరాస్‌పేట: మండల కేంద్రానికి చెందిన క్రాంతి కుమార్ గ్రూప్–1 ఉద్యోగం సాధించారు. సీఎం చేతుల మీదుగా ఎంపీడీఓగా నియామక పత్రం అందుకున్నారు. బొంరాస్‌పేట నుంచి గ్రూప్–1 ఉద్యోగం సాధించడం మొదటి వ్యక్తి కావడంతో స్థానికులు గోవర్ధన్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, నర్సింలుగౌడ్ తదితరులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

కానిస్టేబుల్ టు ఎక్సైజ్ ఎస్ఐ

ధారూరు: మండల పరిధిలోని రాంపూర్ తండా వాసి ఎక్సైజ్ ఎస్ఐగా ఎంపికయ్యారు. తండాకు చెందిన రమేశ్ చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. ఇద్దరు అన్నల సహకారంతో బీటెక్ పూర్తిచేసిన ఆయన 2018 బ్యాచ్‌లో కానిస్టేబుల్‌గా ఎంపికై నాలుగేళ్లు హైదరాబాద్‌లో విధులు నిర్వహించారు. అనంతరం రాసిన గ్రూప్–4 పరీక్షల్లో వికారాబాద్ మున్సిపల్‌లో వార్డు ఆఫీసర్‌గా విధుల్లో చేరారు. ఆదివారం ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్–2 ఫలితాల్లో ఎక్సైజ్ ఎస్ఐగా ఉద్యోగం సాధించారు. దీంతో రమేశ్‌ను మాజీ సర్పంచ్ పాండునాయక్, గ్రామస్తులు అభినందించారు.



ఎక్సైజు ఎస్ఐగా ఎంపికైన రమేశ్

డిప్యూటీ తహసీల్దార్‌గా రాఘవేందర్ గౌడ్

కుల్కచర్ల: గ్రూప్2 ఫలితాల్లో కుల్కచర్ల మండలం తిర్మలాపూర్ గ్రామ యువకుడు డీటీగా నియమితులయ్యారు. ఆదివారం విడుదలైన ఫలితాల్లో తిర్మలాపూర్ గ్రామానికి చెందిన రాఘవేందర్ గౌడ్ డిప్యూటీ తహసీల్దార్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మండల యువకుడు ఎంపికవ్వడంతో ప్రజలు హర్శం వ్యక్తం చేశారు.

మాదకద్రవ్యాలు వాడొద్దు

తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తి గ్రామంలో రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా ఆదివారం గ్రామంలో పర్యటించి పర్యావరణ పరిరక్షణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలు వద్దు–జీవితం ముద్దు అని గ్రామ యువకులకు వివరించారు. అదేవిధంగా సేంద్రియ వ్యవసాయంపై అన్నీ వార్డుల్లో ర్యాలీ నిర్వహించి ప్రజల్లో చైతన్యం తెచ్చారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు డాక్టర్ నవీన్ కుమార్, డాక్టర్ కల్పన, డాక్టర్ శేఖర్, ఏకలవ్య గ్రామీణ వికాస్ కళాశాల ప్రిన్సిపాల్ రాజవర్ధన్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు

శాకాహారంతో ఆరోగ్యానికి మేలు



శాకాహార ర్యాలీ ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల: ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ శాకహారం అలవాటు చేసుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మున్సిపాలిటీ కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో ఆదివారం బ్రహ్మర్షి పితామహా పత్రీజీ పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూమ్‌మెంట్ జిల్లా అధ్యక్షుడు నడిమొళ్ల శంకర్ ఆధ్వర్యంలో మహాకరుణ అహింసా శాకాహార ర్యాలీ, ధ్యాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పిరమిడ్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రజలకు ఆరోగ్యం సమాజం, ప్రకృతి కోసం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. శాకాహారం అనేది ఆరోగ్యానికి, ఆధ్యాత్మికతకు మంచిదన్నారు. ధాన్యంతో ఎన్నో లాభాలు ఉన్నాయన్నారు. ప్రతిఒక్కరూ ధ్యానం అలవాటు చేసుకుంటే మానసిక ప్రశాంతత ఆరోగ్యం లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, మాజీ సర్పంచులు శైలజ, భీమయ్య, ప్రభాకర్, నాయకులు వసంతం, వెంకట్‌రెడ్డి, పెంటయ్యగౌడ్, ఆగిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వెంకటరంగారెడ్డి, రాములు, శ్రీశైలం, ప్రభాకర్, రాజు, నర్సింలు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ పరేషాన్!

- నేతల ఆశలు ఆవిరి
- అభ్యర్థిత్వం ఖరారుకు ప్రయత్నాలు

దౌల్తాబాద్: జిల్లా, మండల పరిషత్, సర్పంచ్ ఎన్నికల్లో బరిలోకి దిగుదామనుకున్న పలువురు ప్రజాప్రతినిధుల ఆశలు ఆవిరయ్యాయి. చాలా మంది మండల పరిషత్, జిల్లా పరిషత్ సభ్యుడి పదవిపై పలువురు నాయకులకు రిజర్వేషన్ ప్రకటనతో తారుమారైంది. బీసీ రిజర్వేషన్ల నేపథ్యంతో నేతల జాతకాలు రివర్స్ అయ్యాయి. రిజర్వేషన్ల ప్రకటన వెలువడడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనాదిగా పార్టీ కోసం అహర్నిషలు కృషి చేసిన వారు పదవులపై ఆశలు పెట్టుకున్న వారికి ఈ ప్రకటన ప్రతికూలంగా మారాయి.

జెడ్పీటీసీ స్థానం జనరల్ మహిళా కావడంతో..

జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌ల రిజర్వేషన్లు వెలువడ్డాయి. ఇక అభ్యర్థిత్వం ఖరారు చేసుకునేందుకు ఆశావహులు సమాయత్తమవుతున్నారు. రిజర్వేషన్ తమకు అనుకూలంగా వచ్చిన మండల నేతలు ఇప్పటికే అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసుకునే పనిలో ఉన్నారు. దౌల్తాబాద్ మండలం ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు జనరల్ మహిళా కావడంతో బీసీ నేతల ఆశావహుల ఆశలు తలకిందులయ్యాయి. జెడ్పీటీసీ స్థానం జనరల్ మహిళకు కేటాయించడంతో అధికార పార్టీకి చెందిన మండలంలోని నందారం గ్రామ ఓ యువనాయకుడు టికెట్ కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అలాగే మండల కేంద్రానికి చెందిన మాజీ మండల ప్రజాప్రతినిధి తన భార్యను బరిలో దింపాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఎంపీపీ కూడా రిజర్వేషన్ జనరల్ మహిళే కావడంతో అధికార ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆశావహులు ఇప్పటికే ముఖ్య నాయకుల ఇళ్లకు వెళ్లి మంతనాలు చేస్తున్నారు. తమ ఓటు బ్యాంకు పరపతి కులం లెక్కలన్నీ ముందే వేసుకుని తమకే అవకాశం దక్కేలా చూసుకుంటున్నారు. అందుకు తగ్గట్టుగా జిల్లా స్థాయి నాయకుల వద్ద పావులు కదుపుతున్నారు.

ఇవేమి రిజర్వేషన్లు!

- స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం
- కొత్త వాటితో కొన్ని సామాజిక వర్గాలకే లబ్ధి
- పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్

కుల్కచర్ల: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం అనుసరిస్తున్న రిజర్వేషన్ల ప్రక్రియ రాజ్యాంగాన్ని అపహస్యం చేసేదిగా ఉందని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన చౌడాపూర్ మండల కేంద్రంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రస్తుతం స్థానిక ఎన్నికల నిర్వహణలో భాగంగా రిజర్వేషన్లను అనుసరిస్తున్న విధానం ఇబ్బందికరంగా ఉన్నదని, ఇంతవరకు రిజర్వేషన్లు రాని గ్రామాలకు కేటాయించకుండా గతంలో కేటాయించిన రిజర్వేషన్లనే మళ్లి కేటాయించడం ఆందోళనకరమన్నారు. జిల్లా అధికారులు ప్రస్తుతం కేటాయించిన రిజర్వేషన్ల విధానాన్ని పునఃసమీక్షించి ఇంతవరకు రిజర్వేషన్లు రాని గ్రామాలకు అట్టి రిజర్వేషన్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మొగులయ్య, వెంకటయ్య, నర్సింలు, రాజు, బన్ని, మహేష్, గణేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.